


www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY




సంపుటి: 01 సంచిక: 246 హైదరాబాద్ మంగళవారం 30-12-2025 పేజీలు: 06 ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

# పాత బాస్ కోసమే రేవంత్ రెడ్డి ఆ ప్రాజెక్టును నిలిపివేశారు

**పాత బాస్ చంద్రబాబును మెప్పించడానికే పాలమూరు ప్రాజెక్టును ఆపారన్న కేటీఆర్**

**కేసీఆర్‌కు పేరు వస్తుందన్న భయంతో రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపణ**

**ఆర్థిక ప్రయోజనాల కోసమే జీహెచ్ఎంసీ విభజనకు కుట్ర అంటూ ఫైరర్**

**ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ కావడం లేదని సీఎం చెప్పగలరా అని ప్రశ్న**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై సర్పంచ్ ఎన్నికలే ప్రజా తీర్పు అని ఉద్ఘాటన**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన 'పాత బాస్', ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబును ప్రసన్నం చేసుకునేందుకే పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మాజీ సీఎం కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే భయంతో పాటు, చంద్రబాబుకు ఆగ్రహం కలుగుతుందనే ఉద్దేశంతోనే రేవంత్ రెడ్డి పనులను ముందుకు సాగనీయడం లేదని ఆయన విమర్శించారు. సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, పాలమూరు ప్రాజెక్టుకు కేవలం 45 టీఎంసీల కేటాయింపులను అంగీకరించడం రాష్ట్రానికి నష్టదాయకమని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే కృష్ణా జలాల్లో 299 టీఎంసీలకు అంగీకరించిందని, దాని ఆధారంగానే బీఆర్ఎస్ ప్రభుత్వం ..మిగతా 2లో



### సీఎం రేవంత్ తిట్లు నాకు దీవెనలు

**తెలంగాణ తెచ్చిన నాయకుడిగా కేసీఆర్ జనం గుండెల్లో ఉన్నారని వ్యాఖ్య**

**నన్ను తిడితే పడతానేమో.. కేసీఆర్ ను తిడితే సహించబోనని వార్నింగ్**

**రేవంత్ రెడ్డి దోపిడీని అడ్డుకుంటున్నందుకే నన్ను తిడుతున్నారని కేటీఆర్ విమర్శ**

02

## ఢిల్లీ హైకోర్టుకు కృతజ్ఞతలు తెలిపిన జూనియర్ ఎన్టీఆర్

**ఎన్టీఆర్ వ్యక్తిగత హక్కుల పరిరక్షణపై ఇటీవల కోర్టు కీలక ఆదేశాలు**

**డిజిటల్ యుగంలో తన హక్కులు కాపాడారంటూ ఎన్టీఆర్ హర్షం**

**న్యాయవాదుల బృందానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు**



02

అసెంబ్లీ నుంచి వెంటనే ఎందుకు వెళ్లారో

## కేసీఆర్‌నే అడగాలి

**నేను కేసీఆర్ మాట్లాడుకున్న విషయాలు అక్కడ అడగండి..**

**ప్రతి ఒక్క సభ్యుడిని మేము గౌరవిస్తాం: సీఎం రేవంత్ రెడ్డి**



03

## పాలమూరు మీద ఎందుకింత వివక్ష..?


**PRLISపై బీఆర్ఎస్ పాలనపై ఉత్తమ్ విమర్శలు**

**డీపీఆర్ ఆలస్యం.. వేల కోట్ల ఖర్చుపై ప్రశ్నలు**

**పాలమూరుకు వివక్షే కారణమా..?**

**90 టీఎంసీలతో ప్రాజెక్టు పూర్తి చేస్తాం : మంత్రి ఉత్తమ్**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**



పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (PRLIS) విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన తీరుపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు బీఆర్ఎస్ హయాంలో తీరని అన్యాయం జరిగిందని, ఇప్పుడు తమ ప్రభుత్వంపై బురద జల్లడం ..మిగతా 2లో

## కేసీఆర్, నేను మాట్లాడుకున్నది మీకెలా చెబుతాను

**ఆసుపత్రికి వెళ్లి కూడా కేసీఆర్‌ను కలిశానని గుర్తు చేసిన రేవంత్ రెడ్డి**

**బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకునే పనిలో ఉందని వ్యాఖ్యలు**

**సభలో ప్రతిపక్షాలకు కౌంటర్ ఇచ్చేందుకు మంత్రులు సిద్ధం కావాలని దిశానిర్దేశం**



**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో తాను మాట్లాడిన విషయాలు మీకెలా చెబుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు అసెంబ్లీకి హాజరైన ..మిగతా 2లో

## అసెంబ్లీని 15 రోజులు జరపాల్సిందే..

**అసెంబ్లీలో ముగిసిన BAC సమావేశం**

**సభ 15 రోజులు జరపాలని పట్టు పట్టాం**

**వారం రోజులు జరుపుతామన్నారు**

**పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు అనుమతి ఇవ్వాలని అడిగాం. -హరీష్**



**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

తెలంగాణ శాసనసభ శీతాకాల సమావేశాల నిర్వహణపై స్పష్టతనిచ్చేందుకు నిర్వహించిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (BAC) సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ..మిగతా 3లో

## రైడ్ క్యాన్సిల్ చేస్తే ఈచలాన్.. యూనిఫాం మస్ట్..!

**న్యూ ఇయర్ ట్రాఫిక్ రూల్స్ ఇవే..!**

**న్యూ ఇయర్ నైట్‌కి సైబరాబాద్ హై అలర్ట్**

**రైడ్ రిఫ్యూజ్ చేస్తే ఈ-చలాన్ తప్పదు**

**డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు**

**యూనిఫాం, డాక్యుమెంట్స్ తప్పనిసరి**




**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

2026 నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకోవాలని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ నగర వాసులకు విజ్ఞప్తి చేసింది. వేడుకల పేరుతో అతిగా ప్రవర్తించే వారు, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. డిసెంబర్ 31 రాత్రి సైబరాబాద్ పరిధిలోని అన్ని ప్రధాన ..మిగతా 3లో

## పాక్ ఆర్మీపై బలూచిస్థాన్ సాయుధుల మెరుపుదాడులు..

**బలూచిస్థాన్‌లో భీకర దాడులు**

**పలు ప్రాంతాల్లో సైనిక స్థావరాలే లక్ష్యం**

**దాడులకు బాధ్యత వహించిన బీఎల్ఏ, బీఎల్ఎఫ్, బీఆర్జీ సంస్థలు**

**సీపెక్ మార్గంలో సైనిక వాహనంపై రిమోట్ కంట్రోల్ బాంబు దాడి**

**బలూచిస్థాన్ స్వాతంత్ర్యం కోసమే దాడులని ప్రకటించిన బలోచ్ గ్రూపులు**



02

## బోగస్ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దు

**గల్ఫ్‌లోని తెలంగాణ ప్రజల ఇబ్బందులపై స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**ప్రవాసుల సమస్యల కోసం ప్రవాసీ ప్రజావాణి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడి**

**టామ్ కామ్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వెల్లడి**



**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

గల్ఫ్‌లోని తెలంగాణ ప్రజల సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. నకిలీ ఏజెంట్ల చేతిలో మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని అసెంబ్లీ వేదికగా ఆయన సూచించారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన ..మిగతా 2లో

## బంగ్లాదేశ్ చొరబాటుదారులు దేశంలో ఎక్కడున్నా పంపించేస్తాం

**అసోంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడిన అమిత్ షా**

**బంగ్లాదేశీయులు ఇక్కడి వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం**

**అలాంటి వారిని కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకుగా భావిస్తోందని ఆరోపణ**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**



భారతదేశంలో ఎక్కడ ఉన్నా బంగ్లాదేశ్ చొరబాటుదారులను వెనక్కి పంపిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. అసోంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, సరిహద్దులు దాటి రాష్ట్రంలోకి చొరబడిన బంగ్లాదేశీయులు ఇక్కడి ప్రజల సంస్కృతి, గుర్తింపులకు ముప్పుగా పరిణమిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వారిని ఓటు ..మిగతా 2లో

# బంగ్లాదేశ్ చొరబాటుదారులు దేశంలో ఎక్కడున్నా పంపించేస్తాం

మొదటిపేజీ తరువాయి

బ్యాంకుగా చూస్తోందని ఆయన ఆరోపించారు.
ఆ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు ప్రతిపక్ష కూటమి ఓటరు జాబితా ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తోందని విమర్శించారు. అసోంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఏళ్లు అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని దుయ్యబట్టారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజల సాంస్కృతిక గుర్తింపును కాపాడటంతో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధి పై దృష్టి సారించిందని తెలిపారు.
బంగ్లాదేశ్ చొరబాటుదారులు ఆక్రమించుకున్న లక్షకు పైగా బిఘాల భూమిని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విడిపించిందని కొనియాడారు. రాష్ట్రంలో పాతుకుపోయిన చొరబాటుదారులను పూర్తిగా నిర్మూలించడానికి బీజేపీకి మరో అవకాశం ఇవ్వాలని కోరారు. గత 11 ఏళ్లలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలోని పలు మిలిటెంట్ సంస్థలతో శాంతి ఒప్పందం చేసుకుందని గుర్తు చేశారు.



# 'పాత బాస్' కోసమే రేవంత్ రెడ్డి ఆ ప్రాజెక్టును నిలిపివేశారు

మొదటిపేజీ తరువాయి

కేటాయింపులు పెంచాలని కేంద్రాన్ని కోరిందని గుర్తుచేశారు. కేసీఆర్ చిత్తశుద్ధి వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిందని, దానిపై ఎన్ని విచారణలు జరిపినా రాజకీయంగా తమకు నష్టం లేదని, నీళ్లు ఇచ్చిందెవరో ప్రజలకు తెలుసని అన్నారు.
ఆర్థిక ప్రయోజనాల కోసమే, మర్చంట్ బ్యాంకర్లు, బ్రోకర్ల సలహాతో జీహెచ్ఎంసీని మూడు భాగాలుగా విభజించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఈ చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని, అసెంబ్లీలో చర్చిస్తామని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై స్పందిస్తూ, నిఘా వ్యవస్థలు నెహ్రూ కాలం నుంచి ఉన్నాయని, ప్రస్తుతం ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ కావడం లేదని సీఎం కచ్చితంగా చెప్పగలరా అని ప్రశ్నించారు.
సిట్‌లు, విచారణల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లిస్తోందని కేటీఆర్ విమర్శించారు. ఇటీవలి సర్పంచ్ ఎన్నికల ఫలితాలే కాంగ్రెస్ పాలనపై ప్రజా తీర్పు అని, రెండేళ్లలోనే ప్రజలు ఆ ప్రభుత్వాన్ని తిరస్కరించారని ఆయన వ్యాఖ్యానించారు.



# అసెంబ్లీ నుంచి వెంటనే ఎందుకు వెళ్లారో కేసీఆర్‌నే అడగాలి

- నేను కేసీఆర్ మాట్లాడుకున్న విషయాలు అక్కడ అడగండి..
- ప్రతి ఒక్క సభ్యుడిని మేము గౌరవిస్తాం: సీఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన మొదటి ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసి కరచాలనం చేశారు. ఇక, సమావేశాలు ప్రారంభమైన కొద్దిసేటికే కేసీఆర్ సభ నుంచి వెళ్లిపోయారు. కాగా, మీడియాతో చిట్ చాట్ లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. నేను కేసీఆర్ మాట్లాడుకున్న విషయాలు అక్కడ అడగండి.. అక్కడ అడగాల్సిన విషయాలు ఇక్కడ అడగడం ఎందుకు..? అని ప్రశ్నించారు. కేసీఆర్ ను కలవడం ఇది రెండో సారి.. మొదటి సారి కాదని సూచించారు. హాస్పిటల్ లో ఉన్నప్పుడు కూడా కలిశాను అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.
అయితే, అసెంబ్లీ సమావేశాల మధ్యలోనే కేసీఆర్ ఎందుకు వెళ్ళిపోయారో ఆయన్నే అడగండి అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సభలోని సభ్యులను గౌరవిస్తాం.. పార్లమెంట్ సెంట్రల్ హాల్ మాదిరి.. మనకు కూడా సెంట్రల్ హాల్ ఉంటుంది.. అందులోకి ఎమ్మెల్యేలు, మంత్రులు అందరికీ యాక్సెస్ ఉంటుంది.. మాజీ ఎమ్మెల్యేలు కూడా సెంట్రల్ హాల్లోకి వచ్చేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. మరోవైపు, సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రుల సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. నీటి వాటాల విషయంలో మంత్రులు అందరూ అలర్టుగా ఉండాలని సూచించారు. సభకు మంత్రుల అటెండెన్స్ మిస్ కావొద్దు.. బీఆర్ఎస్ పార్టీ తమ ఉనికిని కాపాడుకునే పనిలో ఉంది.. ప్రతిపక్షాలకు కౌంటర్ కు సిద్ధం కావాలని తెలిపారు. జిల్లాల వారీగా మంత్రులు ఆటాకింగ్ కు సిద్ధంగా ఉండాలి.. పాయింట్ అఫ్ ఆర్డర్ ముఖ్యం.. ప్రతిపక్షం అడిగే ప్రతీ అంశానికి సమాధానం ఇవ్వాలని వెల్లడించారు. 4వ తేదీన మళ్ళీ బీఏసీ పెడతామని రేవంత్ రెడ్డి తెలియజేశారు.

# పాలమూరు మీద ఎందుకింత వివక్ష..?

మొదటిపేజీ తరువాయి




దుర్మార్గమని ఆయన మండిపడ్డారు.
ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్ఎస్ ప్రభుత్వ చేతకానితనాన్ని మంత్రి ఎండగట్టారు. 2015లో ఈ ప్రాజెక్టు కోసం జీవో జారీ చేసినప్పటికీ, కేంద్ర జల సంఘానికి (CWC) డీపీఆర్ (Detailed Project Report) సమర్పించడానికి నాటి ప్రభుత్వానికి ఏడేళ్ల మూడు నెలల సమయం పట్టిందని ఎద్దేవా చేశారు. ఆశ్చర్యకరంగా, డీపీఆర్ ఆమోదం పొందకముందే రూ. 20,641 కోట్లు ఖర్చు చేశారని, ఇది వారి పాలనలోని అస్తవ్యస్త విధానాలకు నిదర్శనమని విమర్శించారు.
"కాళేశ్వరం ప్రాజెక్టు కోసం లక్ష కోట్లు ఖర్చు పెట్టి, దాని సామర్థ్యాన్ని 2 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు పెంచిన కేసీఆర్.. పాలమూరు రంగారెడ్డి విషయంలో మాత్రం వివక్ష చూపారు" అని ఉత్తమ్ ఆరోపించారు. పాలమూరు సామర్థ్యాన్ని 2 టీఎంసీల నుంచి 1 టీఎంసీకి తగ్గించారని దుయ్యబట్టారు. అంతేకాకుండా, ప్రాజెక్టు పనులను ఉద్దేశపూర్వకంగానే నెమ్మదిగా (Slow down) చేయాలని నాటి రాజకీయ పెద్దలు అధికారులకు ఆదేశాలు ఇచ్చారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.
బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే నాటికి 90 శాతం పనులు పూర్తయ్యాయని ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని మంత్రి ఖండించారు. "అసలు ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 70,000 కోట్లకు పైగా ఉంటే, బీఆర్ఎస్ హయాంలో జరిగింది కేవలం రూ. 27,000 కోట్ల పనులు మాత్రమే. ఇది 90 శాతం ఎలా అవుతుంది?" అని ఆయన ప్రశ్నించారు. పెండింగ్ ప్రాజెక్టులైన కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా వంటి వాటిని కూడా తొమ్మిదిన్నరేళ్లలో పూర్తి చేయలేకపోయారని విమర్శించారు.
బీఆర్ఎస్ ఎన్ని ఆటంకాలు సృష్టించినా, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును తమ ప్రభుత్వం 90 టీఎంసీల సామర్థ్యంతోనే పూర్తి చేసి తీరుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటి వరకు తాము అధికారంలోకి వచ్చాక 11 పంపుల ఇన్‌స్టాలేషన్ పూర్తి చేశామని, ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని వెల్లడించారు.

# సీఎం రేవంత్ తిట్లు నాకు దీవెనలు

- తెలంగాణ తెచ్చిన నాయకుడిగా కేసీఆర్ జనం గుండెల్లో ఉన్నారని వ్యాఖ్య
- నన్ను తిడితే పడతానేమో.. కేసీఆర్ ను తిడితే సహించబోనని వార్నింగ్
- రేవంత్ రెడ్డి దోపిడీని అడ్డుకుంటున్నందుకే నన్ను తిడుతున్నారని కేటీఆర్ విమర్శ

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ రోజు ఉదయం అసెంబ్లీకి వచ్చిన విషయం తెలిసిందే. సభలో తన సీటులో కూర్చున్న కేసీఆర్ వద్దకు వెళ్లి మరీ సీఎం రేవంత్ రెడ్డి పలకరించడం, ఆయనతో కరచాలనం చేసి ఆరోగ్యం గురించి వాకబు చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.
ఈ ఘటనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాజాగా స్పందించారు. ముఖ్యమంత్రి సభలో కేసీఆర్‌ను కలిసేంత సంస్కారం ఉంటే చాలని, అయితే, ఇదే సంస్కారం బయట మాటల్లో కూడా ఉంటే ఇంకా బాగుంటుందని అన్నారు. రాజకీయ ప్రత్యర్థులు ఒకరినొకరు పలకరించుకునేంత సానుకుల వాతావరణం ఉంటే మంచిదేనని పేర్కొన్నారు. తెలంగాణ తెచ్చిన నాయకుడిగా కేసీఆర్ పట్ల రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ గౌరవం ఉందని కేటీఆర్ చెప్పారు.

**రంధ్రాన్వేషణ మానుకోవాలి..**

పాలమూరురంగారెడ్డి విషయంలో రంధ్రాన్వేషణ మానుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ హితవు పలికారు. కేసీఆర్ కు మంచి పేరు వస్తుందనే పాలమూరురంగారెడ్డి పనులను ప్రభుత్వం చేయటంలేదని ఆరోపించారు. దీని వల్ల అంతిమంగా రాష్ట్రానికే నష్టమని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ చిత్తశుద్ధిని కాళేశ్వరం విషయంలో చూడాలని అన్నారు. గోదావరిలో నీటి హక్కుల కోసమే కాళేశ్వరం అదనపు టీఎంసీ పనులను కేసీఆర్ చేపట్టారని చెప్పారు. రేవంత్ రెడ్డి దోపిడీని అడుగడుగునా అడ్డుకుంటున్నందుకే నన్ను తిడుతున్నారు.. ఆయన తిట్లే నాకు దీవెనలు అంటూ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'నన్ను తిడితే పడతానేమో కానీ.. కేసీఆర్‌ను అంటే మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ ఊరుకునేది లేదు' అని హెచ్చరించారు.

**పార్టీని వీడిన వారిని మళ్లీ తీసుకోబోం..**

అధికారం కోల్పోగానే, ఆదరించిన పార్టీని వీడిన నేతలను తిరిగి పార్టీలోకి ఆహ్వానించకూడదనేది తన అభిప్రాయమని కేటీఆర్ చెప్పారు. బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి వెళ్లిన నేతల నియోజకవర్గాల్లో ఎన్ని సర్పంచ్ స్థానాలు గెలిచారని ప్రశ్నించారు. నేతల బలంలేకున్నా కూడా బీఆర్ఎస్ కార్యకర్తలు సర్పంచ్‌లను గెలిపించుకున్నారని చెప్పారు.

**క్షేత్ర స్థాయిలో పరిస్థితులు మారాయి..**

అసెంబ్లీ ఎన్నికల నాటికి ఇప్పటికి పరిస్థితులు మారాయని కేటీఆర్ చెప్పారు. సర్పంచ్ ఎన్నికల్లో ఎదురైన వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకునే కాంగ్రెస్ సర్కారు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టడం లేదని విమర్శించారు. ఫైనాన్స్ కమిషన్ నిధుల కోసం.. అదికూడా తప్పనిసరి పరిస్థితుల్లో మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెబుతోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# పాక్ ఆర్మీపై బలూచిస్థాన్ సాయుధుల మెరుపుదాడులు...

- బలూచిస్థాన్‌లో భీకర దాడులు
- పలు ప్రాంతాల్లో సైనిక స్థావరాలే లక్ష్యం
- దాడులకు బాధ్యత వహించిన బీఎల్ఏ, బీఎల్ఎఫ్, బీఆర్జీ సంస్థలు
- సీపెక్ మార్గంలో సైనిక వాహనంపై రిమోట్ కంట్రోల్ బాంబు దాడి
- బలూచిస్థాన్ స్వాతంత్ర్యం కోసమే దాడులని ప్రకటించిన బలోచ్ గ్రూపులు



**పాకిస్థాన్, (సిద్దిపేట పవర్):**

పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గత కొన్ని వారాలుగా బలోచ్ వేర్పాటువాద సాయుధ గ్రూపులు జరిపిన వరుస దాడుల్లో కనీసం 15 మంది పాకిస్థానీ సైనికులు మరణించారు. ప్రావిన్స్‌లోని కెచ్, పంజ్‌గూర్, తుర్బాత్, సురబ్, నసీరాబాద్ వంటి పలు ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయి. బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ), బలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్), బలోచ్ రిపబ్లికన్ గార్డ్స్ (బీఆర్జీ) అనే మూడు సంస్థలు ఈ దాడులకు బాధ్యత వహిస్తున్నట్లు సోమవారం స్థానిక మీడియా వెల్లడించింది.
డిసెంబర్ 23న కెచ్ జిల్లాలోని తేజాబన్ ప్రాంతంలో పాక్ ఆర్మీ పోస్టుపై తమ ఫైటర్లు దాడి చేసి ఇద్దరు సైనికులను హతమార్చినట్లు బీఎల్ఏ ప్రతినిధి జీయంద్ బలోచ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోమేటిక్ ఆయుధాలు, గ్రెనేడ్ లాంచర్లతో ఈ దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 25న చైనాపాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సీపెక్) మార్గంలో సైనిక వాహనాన్ని లక్ష్యంగా చేసుకొని రిమోట్ కంట్రోల్ బాంబును పేల్చినట్లు తెలిపారు. ఈ ఘటనలో ఆరుగురు సైనికులు చనిపోగా, మరో నలుగురు గాయపడ్డారని వెల్లడించారు. అలాగే, తుర్బాత్‌లో పాక్ సైన్యం వినియోగిస్తున్న కమ్యూనికేషన్ టవర్‌ను ఆదివారం పేల్చివేసినట్లు 'ది బలూచిస్థాన్ పోస్ట్' పేర్కొంది.
మరోవైపు, డిసెంబర్ 27న సురబ్ జిల్లాలోని ఆర్‌సీడీ హైవేపై వాహనాలను అడ్డగించి, సైందక్ మైనింగ్ ప్రాజెక్టుకు చెందిన ట్రక్కులకు భద్రతగా వస్తున్న కాన్వాయ్‌పై దాడి చేసినట్లు బలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ప్రకటించింది. ఈ ఘటనలో ఐదుగురు సైనికులు మరణించినట్లు ఆ సంస్థ ప్రతినిధి మేజర్ గ్వాహ్రామ్ బలోచ్ తెలిపారు.
నసీరాబాద్ జిల్లాలో శనివారం రాత్రి పాక్ సైనిక కాన్వాయ్‌తో తమ ఫైటర్లకు గంటపాటు ఎదురుకాల్పులు జరిగాయని, ఈ ఘటనలో ఇద్దరు సైనికులు మరణించారని బలోచ్ రిపబ్లికన్ గార్డ్స్ (బీఆర్జీ) ప్రకటించింది. బలూచిస్థాన్ స్వాతంత్ర్యం వచ్చేవరకు ఇలాంటి దాడులు కొనసాగిస్తామని ఆ సంస్థ స్పష్టం చేసింది.

# బోగస్ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దు

మొదటిపేజీ తరువాయి

సందర్భంగా, గల్ఫ్‌లో నివసిస్తున్న తెలంగాణ ప్రజల సమస్యలను పలువురు సభ్యులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ, నకిలీ ఏజెంట్లను విశ్వసించి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రవాసుల సమస్యలను స్వీకరించడానికి ప్రజాభవన్‌లో ప్రవాసీ ప్రజావాణి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గల్ఫ్‌కు వెళ్లే కార్మికుల సమస్యలను కూడా పరిష్కరిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ద్వారా విదేశాల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అంతేకాకుండా, వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు వారి నైపుణ్యాలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని అన్నారు. టామ్‌కామ్ ద్వారా మాత్రమే విదేశాలకు వెళ్లాలని ఆయన సూచించారు. ఈ సంస్థలో శిక్షణ పొంది ఇతర దేశాల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని ఆయన కోరారు. నైపుణ్యం కలిగిన యువతకు గల్ఫ్‌తో పాటు ఇతర దేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టామ్‌కామ్‌ను ఏర్పాటు చేసిందని ఆయన స్పష్టం చేశారు.



# ఢిల్లీ హైకోర్టుకు కృతజ్ఞతలు తెలిపిన జూనియర్ ఎన్టీఆర్

- ఎన్టీఆర్ వ్యక్తిగత హక్కుల పరిరక్షణపై ఇటీవల కోర్టు కీలక ఆదేశాలు
- డిజిటల్ యుగంలో తన హక్కులు కాపాడారంటూ ఎన్టీఆర్ హర్షం
- న్యాయవాదుల బృందానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు



**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ ఢిల్లీ హైకోర్టుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. నేటి డిజిటల్ యుగంలో తన వ్యక్తిగత హక్కులను (పర్సనాలిటీ రైట్స్) కాపాడుతూ న్యాయస్థానం ఇచ్చిన రక్షణ ఉత్తర్వులపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఆయన ఓ పోస్ట్ చేశారు. ఇటీవల జూనియర్ ఎన్టీఆర్‌కు సంబంధించిన పర్సనాలిటీ హక్కుల పరిరక్షణ కోరుతూ దాఖలైన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆయన అనుమతి లేకుండా ఆయన పేరు, చిత్రం, వాయిస్ వంటివాటిని వాణిజ్యపరంగా గానీ, ఇతర అవసరాలకు గానీ దుర్వినియోగం చేయకుండా ఈ ఉత్తర్వులు నిరోధిస్తాయి. ఈ న్యాయపోరాటంలో తనకు మద్దతుగా నిలిచిన సుప్రీంకోర్టు న్యాయవాదులు డాక్టర్ బాలజానకి శ్రీనివాసన్, డాక్టర్ అల్కా డాకర్‌లతో పాటు రైట్స్ అండ్ మార్క్స్ సంస్థకు చెందిన రాజేందర్, ఆయన బృందానికి కూడా ఎన్టీఆర్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వారి నిరంతర మద్దతుకు తాను ఎంతో రుణపడి ఉంటానని పేర్కొన్నారు.

## కేసీఆర్, నేను మాట్లాడుకున్నది మీకెలా చెబుతాను

మొదటిపేజీ తరువాయి

కేసీఆర్ కొద్ది నిమిషాల్లోనే వెళ్లిపోయారు. శాసనసభ ప్రారంభం కాగానే రేవంత్ రెడ్డి, కేసీఆర్ వద్దకు వెళ్లి కరచాలనం చేసి ఆయన క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ సభలో రెండు నిమిషాలు మాత్రమే ఉన్నారు. అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌ను అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిశానని తెలిపారు.

అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రతి సభ్యుడిని తాము గౌరవిస్తామని, కేసీఆర్‌ను ఈరోజే కాకుండా, ఆసుపత్రిలో ఉన్నప్పుడు కూడా కలిశానని గుర్తు చేశారు. అసెంబ్లీ నుంచి ఆయన వెంటనే ఎందుకు వెళ్లారో కేసీఆర్‌నే అడగాలని అన్నారు. మీరిద్దరు ఏం మాట్లాడుకున్నారని విలేకరులు ప్రశ్నించగా, తామిద్దరం మాట్లాడుకున్నది మీకెలా చెబుతామని బదులిచ్చారు. ప్రస్తుతం బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో ఉందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. సభలో ప్రతిపక్షాల విమర్శలకు ధీటుగా సమాధానం చెప్పేందుకు మంత్రులు సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాల వారీగా మంత్రులు ఎదురుదాడికి సిద్ధం కావాలని అన్నారు. సభలో పాయింట్ ఆఫ్ ఆర్డర్‌కు ప్రాధాన్యత ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వాలని సూచించారు. జనవరి 4 వరకు సభ జరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు.



# అసెంబ్లీని 15 రోజులు జరపాల్సిందే..

మొదటిపేజీ తరువాయి

తరపున మాజీ మంత్రి హరీష్ రావు పాల్గొని, సభ నిర్వహణ తీరుపై పలు కీలక డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం సభను ఎక్కువ రోజులు నిర్వహించాలని ఆయన గట్టిగా పట్టుబట్టారు.

బీఏసీ సమావేశం అనంతరం హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో చర్చించాల్సిన అంశాలు చాలా ఉన్నాయని, అందుకే అసెంబ్లీని కనీసం 15 రోజుల పాటు నిర్వహించాలని తాము డిమాండ్ చేసినట్లు తెలిపారు. కేవలం వారం రోజుల్లో ప్రజా సమస్యలన్నింటిపై చర్చించడం సాధ్యం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం కేవలం మూడు లేదా నాలుగు రోజులతో సభను ముగించే ప్రయత్నం చేయకూడదని ఆయన స్పష్టం చేశారు.

ప్రతిపక్షాల డిమాండ్లపై ప్రభుత్వం స్పందిస్తూ.. ప్రస్తుతం ఒక వారం పాటు సమావేశాలను నిర్వహించేందుకు అంగీకరించింది. అయితే, ఆ తర్వాత పరిస్థితులను బట్టి సమావేశాలను మరిన్ని రోజులు పొడిగించే అంశంపై మరోసారి బీఏసీ సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు హరీష్ రావు వెల్లడించారు. దీనివల్ల సభ ఎన్ని రోజులు జరుగుతుందనే దానిపై ఇంకా పూర్తిస్థాయి స్పష్టత రావాల్సి ఉంది.

నదీ జలాల అంశంపై సభలో ఇప్పటికే రాజకీయం వేడెక్కింది. ప్రభుత్వం ఈ అంశంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ (PPT) ఇచ్చేందుకు సిద్ధమవుతుండగా, ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా తాము కూడా పీపీటీ ఇచ్చేందుకు అవకాశం కల్పించాలని బీఏసీ సమావేశంలో కోరింది. గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని, ప్రాజెక్టుల వివరాలను ప్రజలకు వివరించేందుకు తమకు కూడా సమాన అవకాశం ఇవ్వాలని హరీష్ రావు కోరారు.




అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే బీఏసీలో జరిగిన ఈ చర్చలు చూస్తుంటే, రాబోయే రోజుల్లో సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరేలా కనిపిస్తోంది. వారం రోజుల సమావేశాల్లో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుంది, ప్రతిపక్షం ప్రభుత్వంపై ఎలాంటి అస్త్రాలను ప్రయోగిస్తుందనేది వేచి చూడాలి.

## అప్పారెడ్డి గూడెంలో ఘనంగా ప్రమాణ స్వీకార కార్యక్రమం

- **ముఖ్య అతిథిగా హాజరైన గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి**

**షాబాద్,డిసెంబర్ 29(సిద్దిపేట పవర్):**

షాబాద్ మండలంలోని అప్పారెడ్డి గూడ గ్రామంలో నూతన సర్పంచ్ పోలేపల్లి సందీప్ గౌడ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ శ్రీ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అప్పారెడ్డి గూడ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీకి చెందిన 4వ వార్డు సభ్యుడు జగదీష్ గౌడ్, బీజేపీ పార్టీకి చెందిన మిద్దెల వెంకటేష్‌తో పాటు పది మంది బీఆర్ఎస్ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, షాబాద్ సర్పంచ్ గుండాల అశోక్, అంతారం సర్పంచ్ ఈగ ప్రభాకర్ రెడ్డి, నాగర్ గూడ సర్పంచ్ స్వరూప మహేందర్ గౌడ్, సంకపల్లి గూడా సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య, తాళ్లపల్లి సర్పంచ్ తాళ్ల మాణిక్యం గౌడ్, షాబాద్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ దండు రాహుల్, సర్దార్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంజీవ రెడ్డి, మాజీ సర్పంచులు బేగరి ఆంజనేయులు, బండ సతీష్ యాదవ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు,గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.







## రైడ్ క్యాన్సిల్ చేస్తే ఈచలాన్.. యూనిఫాం మస్ట్.!

మొదటిపేజీ తరువాయి

రహదారులపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో డిసెంబర్ 31 సాయంత్రం 8 గంటల నుంచే సైబరాబాద్ వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు ప్రారంభం కానున్నాయి. ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, మితిమీరిన వేగాన్ని అరికట్టేందుకు 100కు పైగా ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిని గుర్తించేందుకు అత్యాధునిక కెమెరాలను కూడా వినియోగిస్తున్నారు.

క్యాబ్, ట్యాక్సీ , ఆటో డ్రైవర్లు విధిగా యూనిఫాం ధరించాలి. వాహనానికి సంబంధించిన అన్ని ఒరిజినల్ డాక్యుమెంట్లు వెంట ఉంచుకోవాలి. ప్రయాణికులు కోరినప్పుడు రైడ్‌ను నిరాకరిస్తే (Refusal) ఈచలాన్ ద్వారా రూ. 500 జరిమానా విధిస్తారు. పండుగ పేరుతో ప్రయాణికుల నుండి అదనపు డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవు.మద్యం తాగి వాహనం నడిపి పట్టుబడితే రూ. 10,000 జరిమానా లేదా జైలు శిక్ష విధిస్తారు. వాహనాన్ని తక్షణమే సీజ్ చేస్తారు. నిబంధనలు పదే పదే ఉల్లంఘిస్తే డ్రైవింగ్ లైసెన్స్‌ను శాశ్వతంగా రద్దు చేయాలని ఆర్టీఓ అధికారులకు సిఫార్సు చేస్తారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలు చేస్తే, కొత్త శిక్షా స్మృతి (BNS) ప్రకారం బాధ్యులపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు.

బార్ , పబ్‌ల నిర్వాహకులు తమ కస్టమర్లు మద్యం తాగి వాహనాలు నడపకుండా చూడాలి. తాగి వాహనం నడిపే వారికి సహకరించినా లేదా వారికి ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లు (Drivers/Cabs) చేయకపోయినా సదరు యాజమాన్యాలపై కేసులు నమోదు చేస్తామని పోలీసులు స్పష్టం చేశారు. మైనర్లు వాహనం నడిపితే వాహన యజమాని , డ్రైవర్ ఇద్దరిపై కేసులు పెడతారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు, సరైన డాక్యుమెంట్లు లేని వాహనాలను వెంటనే సీజ్ చేసి ఆర్టీఓకు తరలిస్తారు. వాహనాల్లో భారీ శబ్దంతో మ్యూజిక్ పెట్టడం నిషేధం.

ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకపోవడం , ర్యాష్ డ్రైవింగ్‌పై డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఉంచుతారు. న్యూ ఇయర్ వేడుకలను బాధ్యతాయుతంగా జరుపుకోవాలని, మద్యం సేవించిన వారు డ్రైవర్లను నియమించుకోవాలని లేదా క్యాబ్ సేవలను వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు. ప్రశాంతమైన వాతావరణంలో కొత్త ఏడాదిని ఆహ్వానించడానికి ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.








## దుండిగల్ లోని పలు సమస్యలపై డిప్యూటీ కమిషనర్ ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

**కుత్బుల్లాపూర్,డిసెంబర్ 29(సిద్దిపేట పవర్):**

దుండిగల్ సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్ నాయక్ ని ఉమ్మడి కుత్బుల్లాపూర్ మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు, దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కావలి గణేష్ నూతన డిప్యూటీ కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, దుండిగల్ సర్కిల్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.ముఖ్యంగా ఓఆర్ఆర్ నుంచి దుండిగల్ గ్రామం వరకు రాత్రి వేళల్లో సరైన లైట్స్ లేకపోవడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,వెంటనే స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే రోడ్ల మరమ్మతులు,డ్రైనేజీ వ్యవస్థ,పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర మౌలిక వసతుల అభివృద్ధిపై కూడా చర్చించారు. సమస్యలపై స్పందించిన డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ ప్రజా సమస్యలను ప్రాధాన్యతగా తీసుకొని పరిశీలించి,సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జక్కుల గోపాల్ యాదవ్, పండుగ శ్రీశైలం ముదిరాజ్,సిరగల్ల బాబు,వాపుల శ్రీనివాస్,దొంతి మహేష్ ముదిరాజ్, చెట్లపల్లి దత్తు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## కీసర సర్కిల్‌లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్

**కీసర,డిసెంబర్ 29(సిద్దిపేట పవర్):**

మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్‌లో శానిటేషన్ పనులను బలోపేతం చేయడానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టబడనుంది. సోమవారం డిప్యూటీ కమిషనర్ వసంత కీసర, దమ్మాయిగూడ, జవహర్‌నగర్, శామీర్‌పేట కార్యాలయాల అధికారులతో సమావేశం నిర్వహించారు. సభలో, ఇంటి పన్నుల వసూలును వేగవంతం చేయడం, శానిటేషన్ పనులను సమర్థవంతంగా అమలు చేయడం కోసం అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. డిసెంబర్ 29, 2025 నుంచి జనవరి 31, 2026 వరకు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించామని డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

"ప్రజల్లో శానిటేషన్ పట్ల అవగాహన పెంపొందించడం, ప్రాంతాలను శుభ్రంగా ఉంచడం ప్రధాన లక్ష్యం" అని డిసీ పేర్కొన్నారు.



## యూరియా కొరత లేదని స్పష్టం చేసిన కలెక్టర్

- **రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు: కలెక్టర్ మను చౌదరి**

**మేడ్చల్–మల్కాజిగిరి,డిసెంబర్ 29(సిద్దిపేట పవర్):**

మేడ్చల్ జిల్లాకు అవసరమైన యూరియా ఎరువులు సరిపడా నిల్వల్లో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళనకు లోనుకావాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 773 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి సేల్ కౌంటర్ వద్ద షామియానాలు, త్రాగునీటి సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఉదయం 6 గంటల నుంచే యూరియా విక్రయాలు ప్రారంభించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న నిల్వలు సాగుకు సరిపోతాయని, అవసరాన్ని బట్టి అదనపు సరఫరాలు కూడా క్రమం తప్పకుండా అందుతున్నాయని కలెక్టర్ భరోసా ఇచ్చారు.



యూరియా పంపిణీపై సంబంధిత అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నారని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూరియా సరఫరాలో ఎలాంటి సమస్యలు ఎదురైతే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. అవసరానికి మించి కొనుగోలు చేయకుండా శాస్త్రీయ పద్ధతిలో వినియోగించాలని కలెక్టర్ కోరారు.

## యాంటీ కరప్షన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

**కుత్బుల్లాపూర్,డిసెంబర్ 29(సిద్దిపేట పవర్)**

సుచిత్ర సర్కిల్ లొ జరిగిన యాంటీ కరప్షన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఇందులో పాల్గొన్న ప్రజలు మరియు యాంటీ కరప్షన్ టీం సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో జరుపుతామని యాంటీ కరప్షన్ డైరెక్టర్ దొడ్ల నాగేశ్వర్ రెడ్డి ,వైస్ చైర్మన్ ప్రశాంత్ ముదిరాజ్ ,డిస్ట్రిక్ట్ డైరెక్టర్ లక్ష్మా రెడ్డి,డిస్ట్రిక్ట్ వైస్ ప్రెసిడెంట్ యోగి,డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ భాస్కర్ మరియు టీం సభ్యులు పేర్కొన్నారు...ఇందులో భాగంగ ప్రతి ఒక్కరు స్పందించి సంతకాల సేకరణకు మరియు ఇతర కార్యక్రమాలకు మాకు తదితర కార్యక్రమాలకు సహకరించాలని టీం సభ్యులు కోరడం జరిగింది మరియు హర్షం వక్తం చేశారు.



## ఎఫ్‌పీఓ రైతులకు టిడిఎఫ్–జాతీయ సహజ వ్యవసాయ మిషన్‌పై అవేర్నెస్

- జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహించిన టిడిఎఫ్ – జై కిసాన్

**సికింద్రాబాద్, డిసెంబర్ 29 ( సిద్దిపేట పవర్ ):**

జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం (టిడిఎఫ్), బుగ్గ రాజేశ్వర స్వామి రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీఓ) మరియు వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నారాయణరావుపేట రైతు వేదికలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షులు మట్టా రాజేశ్వర్ రెడ్డి రైతులకు సేంద్రీయ వ్యవసాయం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా నేషనల్ నేచురల్ ఫార్మింగ్ మిషన్‌కు సంబంధించిన లక్ష్యాలు, ప్రయోజనాలు, అమలు విధానాలపై రైతులతో విస్తృతంగా చర్చించారు. రసాయనిక ఎరువులు, పురుగుమందులను మోతాదుకు మించి వినియోగించడం వల్ల నేల, నీరు, గాలి కాలుష్యం అవుతాయని, దీని ప్రభావం భవిష్యత్ తరాలపై కూడా పడుతుందని ఆయన హెచ్చరించారు.




రైతులు రసాయన ఎరువులపై ఆధారపడటం వల్ల పెట్టుబడి ఖర్చులు రోజురోజుకీ పెరుగుతున్నాయని, దీనిని అధిగమించాలంటే సుస్థిర వ్యవసాయం వైపు అడుగులు వేయాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు మాత్రమే ఎరువులు వినియోగించాలని, వరి కోత అనంతరం పొట్టేలను తగలబెట్టకుండా వేస్ట్ డీకంపోజర్ ఉపయోగించాలని తెలిపారు. అదేవిధంగా పంటలలో కీటక నియంత్రణ కోసం జిగురు అట్టలు (స్టిక్కీ ట్రాప్స్) వాడటం ద్వారా రసాయనాల వినియోగాన్ని తగ్గించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వరుణ్, బుగ్గ రాజేశ్వర స్వామి, టిడిఎఫ్ జై కిసాన్ ప్రాంతీయ అధికారి ఐలాపురం అనిల్‌తో పాటు పలువురు రైతులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రైతుల సంక్షేమం, స్థిరమైన వ్యవసాయ అభివృద్ధే లక్ష్యంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

## అలరించిన ఫెమి–9 ఉమెన్స్ క్లబ్ ఫ్యాషన్ షో

**సికింద్రాబాద్, డిసెంబర్ 29 ( సిద్దిపేట పవర్ ):**

ర్యాంప్ వాక్ కేవలం ఫ్యాషన్ కోసమే కాకుండా మహిళల్లో ఆత్మవిశ్వాసం, ధైర్యం, ఆలోచనల్లో మార్పుకు నాంది పలుకుతుందని చీఫ్ గెస్ట్ మిసెస్ ఇండియా తెలంగాణ క్రౌన్ విన్నర్ సుధా నాయుడు అన్నారు. బేగంపేట ఫ్యామిలీ వరల్డ్ లో ఫెమి-9 ఉమెన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యూటీ ఫ్యాషన్ మీట్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఫ్యాషన్ షో లో మహిళలు, పిల్లలు, టీనేజర్లు ధైర్యంగా ర్యాంప్‌పై నడిచి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇది కేవలం అందం కాదు, ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచిందని ఆమె పేర్కొన్నారు. విజేతలుగా నిలిచిన మిస్ కేటగిరి నుంచి మాహితిరెడ్డి, మిసెస్ కేటగిరి నుంచి ఝాన్సీలకు చీఫ్ గెస్ట్ సుధానాయుడు వారికి క్రౌన్‌లను అందించి, బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫెమి-9 అధ్యక్షురాలు అను, ఉపాధ్యక్షురాలు హేమ, కార్యదర్శి విజయ, ఫౌండర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## నిషేధిత చైనీస్ మాంజా ఘటనలపై ఎస్‌హెచ్‌ఆర్‌సీ లో కేసు నమోదు


**సికింద్రాబాద్, డిసెంబర్ 29 ( సిద్దిపేట పవర్ )::**

రాష్ట్రవ్యాప్తంగా నిషేధిత చైనీస్ మాంజా (అబ్రేసివ్ దారం) వాడకంతో చోటు చేసుకుంటున్న ప్రమాదాలు, గాయాలు, మరణాలపై నగరానికి చెందిన మానవ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మనేని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (టీజీ ఎస్‌హెచ్‌ఆర్‌సీ) కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషన్ మానవ హక్కుల ఉల్లంఘన కేసును నమోదు చేసింది.ఫిర్యాదులో చైనీస్ మాంజా వాడకం వల్ల జరిగిన తీవ్ర ఘటనలను రామారావు కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. కీసరలో మైనర్ బాలుడు జశ్వంత్ రెడ్డి తీవ్రంగా గాయపడగా, షంషేర్ గంజ్‌కు చెందిన జమీల్ మెడ చుట్టూ లోతైన గాయంతో 22 కుట్లు వేయించుకోవాల్సి వచ్చిందన్నారు.ఈ ఘటనలను అరికట్టడంలో, నిషేదిత చైనీస్ మాంజా విక్రయాల అరికట్టడంలో విఫలమయ్యారని పేర్కొంటూ సీపీ ఆనంద్ ఐపీఎస్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (హోం)లపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారు కోరారు. ఈ కేసు ఈనెల 30న టీజీ ఎస్‌హెచ్‌ఆర్‌సీ గౌరవ చైర్‌పర్సన్ జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ ధర్మాసనం ముందు విచారించే అవకాశం ఉందని తెలిపింది

## మద్దూరు మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులుగా శనిగరం సత్యనారాయణ

**చేర్యాల, డిసెంబర్ 29 (సిద్దిపేట పవర్)**

మద్దూరు మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులుగా మండలంలోని నర్సయాపల్లి గ్రామ సర్పంచ్ శనిగరం సత్యనారాయణ ఎన్నికయ్యారు..ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన మద్దూరు మండల సర్పంచ్ లందరికీ ధన్యవాదాలు అని, అదే విధంగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు అని తెలిపారు..తన మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా మండలంలోని సర్పంచ్ లందరికీ అందుబాటులో ఉంటూ, తన సహాయ సహకారాలను వారికి అందిస్తానని సత్యనారాయణ తెలిపారు..



## ఏబీవీపీ 44వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

**సిద్దిపేట పవర్ సిద్దిపేట బ్యూరో:**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో ఏబీవీపీ 44వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను స్థానిక వీర సావర్కర్ చౌరస్తా వద్ద ఆవిష్కరించారు . ఈ సందర్భంగా ఎబివిపి రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ చింతల పవన్ మాట్లాడుతూ జనవరి 3,4,5 తేదీలలో శంషాబాద్ లో జరిగే ఏబీవీపీ 44వ రాష్ట్ర మహాసభలని విజయవంతం చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండి విద్యార్థి ప్రతినిధులు, మూడు రోజుల మహాసభల కార్యక్రమంలో పాల్గొని రాష్ట్ర స్థితి గతులు, సంక్షేమ హాస్టల్ల పరిస్థితులు మరియు విద్యారంగ సమస్యలు ఇలా అనేక అంశాలపై చర్చిస్తూ తీర్మానం చేయడంతో పాటు రాష్ట్రంలో జాతీయ విద్యా విధానం అమలుకై కృషి చేస్తున్నామని అన్నారు. ఈ మూడు రోజుల కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులతో రాబోవు సంవత్సరపు కార్యక్రమాల గురించి తీర్మానాలు ప్రవేశపెట్టడం ఆమోదించడం లాంటి చర్చలు చేయడం జరుగుతుందని అన్నారు ఈ సందర్భంగా స్థానిక వీర సావర్కర్ చౌరస్తాతో పాటు స్థానిక ప్రభుత్వ డిగ్రీ, ప్రభుత్వ మహిళా డిగ్రీ, ఇందూర్ ఇంజనీరింగ్, ప్రతిభ డిగ్రీ కళాశాలల్లో కూడా పోస్టర్ ఆవిష్కరించి ఈ యొక్క రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఫణిందర్, నగర కార్యదర్శి పరశురాం, విభాగ్ హాస్టల్ కన్వీనర్ భాను ప్రసాద్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రాకేష్,నగర ఉప అధ్యక్షులు భరత్,నగర సంయుక్త కార్యదర్శి రాకేష్ తదితర విద్యార్థి నాయకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




## ఉపసర్పంచుల ఫోరం ఏకగ్రీవంగా ఎన్నిక

**నంగునూరు మండలం డిసెంబర్ 29**

నంగునూరు మండల కేంద్రంలో సోమవారం ఉపసర్పంచుల ఫోరం ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది ఫోరం అధ్యక్షులుగా నంగునూర్ గ్రామానికి చెందిన కోల శ్రీధర్ గౌడ్ ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా తిప్పని శ్రీనివాస్ (గట్లమల్యల), రేపక లలిత -రాజేందర్ (బద్దిపడగ),జనరల్ సెక్రటరీగా కుచం విక్రమ్ (నర్మెట్ట) ఎన్నికయ్యారు.సెక్రటర్లు లాస్య నర్సింలు (మద్దూంపూర్)కాటం హారిక-రాజేష్ (రాజగోపాలపేట),కోశాధికారిగా బొడిగే తిరుపతి గౌడ్ (రాంపూర్),ఆర్గనైజింగ్ సెక్రటరీగా విర్రనపేట రమేష్ గౌడ్ (అప్పలైచెరువు),లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.




## క్లిష్టమైన సర్జరీలు చేస్తూ...చిన్నారులకు పునర్జన్మనిస్తున్న గాంధీ డాక్టర్లు....

- కాళోజీ హెల్త్ వర్శిటీ వీసీ డా.రమేశ్ రెడ్డి గాంధీ ఆసుపత్రిలో నేషనల్ పీడియాట్రిక్ సర్జన్స్ డే సెలబ్రేషన్స్..

**సికింద్రాబాద్, డిసెంబర్ 29 ( సిద్దిపేట పవర్ ):**


ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారులకు క్లిష్టమైన శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించి వారికి పునర్జన్మనిస్తున్న గాంధీ దవాఖాన పీడియాట్రిక్ సర్జరీ విభాగం వైద్యుల సేవలు అభినందనీయమని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కే.రమేశ్ రెడ్డి అన్నారు.జాతీయ పీడియాట్రిక్ సర్జన్స్ డే సందర్భంగా గాంధీ దవాఖాన పీడియాట్రిక్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలకు అందించిన వైద్య సేవలను గుర్తు చేసుకుంటూ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో సాధ్యం కాని అనేక కేసులను గాంధీలో విజయవంతంగా నిర్వహించిన వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ప్రత్యేకంగా ప్రొఫెసర్ కే.నాగార్జున చిన్నారులపై చూపే శ్రద్ధ, అనుభవంతో చేసే చికిత్స వల్ల అనేకమందికి నూతన జీవితం లభించిందని వారు పేర్కొన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షలాది రూపాయలు ఖర్చు అయ్యే క్లిష్టమైన అపరేషన్లను తమ పిల్లలకు ఉచితంగా చేసి, తమను కాపాడారని పిల్లల తల్లిదండ్రులు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా కేక్ కట్ చేసి చిన్నారులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.వాణీ, పీడియాట్రిక్ సర్జరీ విభాగం హెచ్ఓడీ ప్రొఫెసర్ కే.నాగార్జున, పీడియాట్రిక్ మెడిసిన్ హెచ్ఓడీ డాక్టర్ కే.వాసుదేవ్‌తో పాటు డాక్టర్లు పవన్ రావు, అశ్రిత్, మనోజ్, విష్ణు, హర్ష, సాజిద్, ఈఎన్టీ విభాగం హెచ్ఓడీ ప్రొ. డా.భూపేందర్ సింగ్ రాథోడ్, ఇతర విభాగాల హెచ్ఓడీలు, ఆర్ఎంఓలు, నర్సింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## తహసీల్దార్ ను కలిసిన వీరన్నపేట పాలక వర్గం

**చేర్యాల, డిసెంబర్ 29 (సిద్దిపేట పవర్)**

చేర్యాల మండలం వీరన్నపేట గ్రామ పంచాయతీ నూతన పాలక వర్గం చేర్యాల తహసీల్దార్ దిలీప్ నాయక్ ను మర్యాదపూర్వకంగా కలిసారు..ఈ సందర్భంగా తహసీల్దార్ నూతన పాలక వర్గానికి శుభాకాంక్షలు తెలిపి, గ్రామాభివృద్ధికి తోడ్పడండి అని తెలిపారు..తహసీల్దార్ ను కలిసిన వారిలో వీరన్నపేట సర్పంచ్ ఎలికట్టే శైలజ శివశంకర్, ఉపసర్పంచ్ బంగారీగల్ల కిరణ్, వార్డు సభ్యులు రాకేష్, వెంకట్ పాల్గొన్నారు..



## అలరించిన ఫెమి – 9 ఉమెన్స్ క్లబ్ ఫ్యాషన్ షో






- ర్యాంప్ వాక్తో ఆకట్టుకున్న మోడల్స్

**డిసెంబర్29 సిద్దిపేట పవర్**

బేగంపేటలో నిర్వహించిన ఫ్యాషన్ షోలో మోడల్స్ తమ క్యాట్ వాక్... ర్యాంప్ వాక్లతో అదరగొట్టారు. విభిన్న డిజైన్లతో తయారు చేసిన అందమైన దుస్తులతో మోడల్స్ చేసిన ర్యాంప్ వాక్.. క్యాట్ వాక్ ఆహుతులను ఎంత గానో అలరించాయి. బేగంపేట ఫ్యామిలీ వరల్డ్ ఫెమి 9 ఉమెన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్యూటీ ఫ్యాషన్ మీట్ కార్యక్రమం ఆద్యంతం అత్యంత ఆసక్తికరంగా సాగింది. ఆత్మ విశ్వాసానికి ప్రతీకగా అందాల భామల ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. ఫ్యాషన్ షో అంటే కేవలం అందం కాదు ఆత్మ విశ్వాసం, గౌరవానికి ప్రతీకని నిరూపించారు. ఈ ఫ్యాషన్ షోలో మహిళలు, పిల్లలు, టీనేజర్లు ధైర్యంగా రాంప్ పై నడిచి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ డిజైనర్ సుధా నాయుడు మాట్లా డుతూ.. ర్యాంప్ వాక్ కేవలం ఫ్యాషన్ కోసం కాదని మహిళల్లో ఆత్మ విశ్వాసం, ధైర్యం, ఆలోచనల్లో మా ర్పుకు శ్రీకారం చుట్టనుందని స్పష్టం చేశారు. మహిళలకు గౌరవం, అవకాశాల కోసం వేదిక అవస రమని తెలిపారు. ఆత్మవిశ్వాసంతో నిజమైన గ్లామర్ నింపారని సుధా నాయుడు స్పష్టం చేశారు. ఈ ఫ్యాషన్షోలో విజేతగా నిలిచిన కర్తల హిమాన్షు,కర్తల రాజ శేఖర్,కర్తల ప్రశాంతి సిటిజన్ క్లబ్ సిద్దిపేట స్కూల్ వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సెమి నైన్ ప్రెసిడెంట్ అను, వైస్ ప్రెసిడెంట్ హేమ, సెక్రటరీ విజయ, ఫౌండర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## తీగుల్ లో ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

- దేశ సమైక్యతను కాపాడే పార్టీ కాంగ్రెస్ పార్టీ
- మాజీ సర్పంచ్ కప్పర భాను ప్రకాశ్ రావు

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**


భారత జాతీయ కాంగ్రెస్ 141వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం జగదేవపూర్ మండలం తీగుల్ లో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ నిర్వహించారు.ఈ సందర్భంగా తీగుల్ మాజీ సర్పంచ్ కప్పర భాను ప్రకాశ్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే బడుగు బలహీన వర్గాలకు సబ్బండ వర్గాల సంక్షేమ కోసం ఎన్నెన్నో పథకాలు ప్రేశ పెట్టి నేడు బీజేపీ గాంధీ పేరు మార్చడం చేస్తుందని గాంధీ నెహ్రు దేశానికి త్యాగలు మరువలేవని కొనియాడారు. మాజీ ఎంపీటీసీ మంజుల మహేందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సులోచనా బిక్షపతి, రాధా కృష్ణ రెడ్డి,జంగని ఐలయ్య, చౌదరి కర్ణకరు, పెద్దిరెడ్డి నరసింహా రెడ్డి కొండపోచమ్మ డైరెక్టర్ జనార్ధన్ రెడ్డి వార్డు సభ్యులు బునారి రాజు,వెంకట్, సీనియర్ నాయకులు పూసలి రవి, గిరిపల్లి నర్సింలు, దయ్యాల కిష్టయ్య, మ్యకల బొర్రా మల్లయ్య ఇస్మాయిల్ , బట్టు నరసింహా రెడ్డి, బండమీద బిరయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు కోడిగుడ్ల మహేష్, సర్దగని పోచయ్య, రాంబాబు, రమేష్, మల్లేష్, గోవిందు మనోజ్ , చాట్లపల్లి వెంకటేష్, గొర్లకడి కుమార్, కుదుదుల సంతోష్, వంక అనిల్ సర్దెగని అనిల్, భాను చారి, నితీష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సీపీఐ సీనియర్ నాయకులు బట్టు దయానంద రెడ్డి, మాజీ సర్పంచ్ బిక్షపతి, తోందూరి నరసింహ రెడ్డి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



# గంజాయి విక్రయం చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు

- **నిధింతులను అదుపులోకి జగదేవపూర్ పోలీసులు**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ ప్రతినిధి :**



జగదేవపూర్ మండల కేంద్రం జగదేవపూర్ గ్రామ శివారులో గంజాయి విక్రయ వ్యక్తులను అరెస్ట్ చేసిన జగదేవపూర్ పోలీసులు. పోలీసులు తెలిపిన

నిందితుల వివరాలు:

1. మంకీ వంశీ, తండ్రి: రామచంద్రం, వయస్సు: 23 సంవత్సరాలు, వృత్తి: కూలీ, నివాసం: గౌరారం గ్రామం, వర్గల్ మండలం, సిద్దిపేట జిల్లా
2. గంటె మనోజ్, తండ్రి: మల్లేష్, వయస్సు: 19 సంవత్సరాలు, వృత్తి: కూలీ, నివాసం: నర్సంపల్లి గ్రామం, ములుగు మండలం, సిద్ద పేట జిల్లా.

కేసు వివరాలు: నాడు పి. మహేందర్ రెడ్డి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గజ్వేల్ ఆదేశాల మేరకు నమ్మదగిన సమాచారంపై జగదేవ్పూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్ఐ శ్రీ ఓ. దామోదర్ పోలీస్ సిబ్బందితో కలిసి జగదేవ్పూర్ గ్రామ శివారులోని కెనాల్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, కొండపోచమ్మ వైపు నుండి జగదేవపూర్ వైపు అనుమానాస్పదంగా వస్తున్న మోటార్ సైకిల్‌ను అడ్డుకొని తనిఖీ చేయగా నిందితుల వద్ద 47 గ్రాములు నిషేధిత గంజాయి లభ్యమైంది. గంజాయిని సీజ్ చేసి, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసిన వస్తువులు:

1. నిషేధిత గంజాయి - 47 గ్రాములు
2. సెల్ ఫోన్లు - 02 (రెండు)
3. మోటార్ సైకిల్ - 01 ఎపి.24.యన్.7872

నిందితులు పోతిరెడ్డిపల్లి ప్రాంతం నుండి గంజాయి తెచ్చుకుని వినియోగం విక్రయం చేస్తున్నట్లు విచారణలో ఒప్పుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోలీసులు గంజాయి సంబంధిత అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉన్నట్లయితే ప్రజలు వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు.

# గొర్రె మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ

**సిద్దిపేట పవర్ గజ్వేల్ ప్రతినిధి:**



గొర్రె మేకల పెంపకదారులు తప్పకుండా గొర్రె మేకలకు నట్టల నివారణ మందును వేయించాలని స్థానిక సర్పంచ్ రజిత పేర్కొన్నారు. సోమవారం జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామంలో పశు వైద్యాధికారి శ్వేత ఆధ్వర్యంలో గొర్రె మేకలకు నట్టల నివారణ మందు పంపిణి చేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి శ్వేత మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో గొర్రె మేకలకు నట్టల నివారణ మందులు వేస్తున్నామని వివరించారు. గ్రామంలో గొర్రె మేకల పెంపకదారులు తప్పకుండా నట్టల నివారణ మందులు వేయించుకోవాలని సూచించారు. ఈనెల 31 వరకు నట్టల నివారణ మందులు పంపిణి చేస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని గొర్రె మేకల పెంపకదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, గొర్రె మేకల పెంపకదారుల సంఘం అధ్యక్షుడు బండారి కిష్టయ్య, వైద్య సిబ్బంది మౌనిక, గోపాలమిత్ర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# పల్లా ప్రస్తావన లకు సమాధానాలేవి..?

- **చేర్యాల రెవెన్యూ డివిజన్ ను పట్టించుకొని ప్రభుత్వం**
- **CPI నేత రామగల్ల నరేష్.**

**చేర్యాల, డిసెంబర్ 29 (సిద్దిపేట పవర్)**



చేర్యాల ప్రజల ఆకాంక్షను గుర్తించిన జనగామ శాసనసభ్యులు పల్ల రాజేశ్వర్ రెడ్డి దాదాపు ఇప్పటికీ చేర్యాల రెవెన్యూ డివిజన్ అంశాన్ని మూడు నాలుగు పర్యాయాలు అసెంబ్లీ సాక్షిగా వినిపించిన కనీసం ఈ అంశం మీద ప్రభుత్వానికి ఉలుకు పలుకు లేకపోవడం చేర్యాల ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యం అని సీపీఐ నేత రామగల్ల నరేష్ తెలిపారు.. ఎలక్షన్ల ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ జనగామ పర్యటనలో రెవెన్యూ డివిజన్ చేర్యాలను ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి మరిచారు, అదే విధంగా నియోజకవర్గ ఇన్చార్జి అయిన కొమ్మూరి ప్రతాపరెడ్డి ఈ విషయంలో రెవెన్యూ మినిస్టర్ అయిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దగ్గరికి జేఏసీగా తీసుకెళ్లడం జరిగింది కానీ మంత్రి ఇచ్చిన హామీ విషయంలో ఎక్కడ కూడా ప్రస్తావించలేదు.. కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్ష పార్టీలో ఉన్న ఎమ్మెల్యే మాట్లాడుతున్నప్పుడు స్థానిక కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ పెద్దలను ఒప్పించి చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలి అని విన్నవించారు..మొన్నటి స్థానిక సంస్థల ఎన్నికల్లో స్పష్టంగా అర్థమైంది ఎందుకంటే హామీ ఇచ్చి నెరవేర్చకపోతే ప్రజలు మనకు ఓటు ద్వారా ఆ నిరసనలు తెలియజేస్తారని ఇక్కడ బిఆర్ఎస్ అత్యధిక సర్పంచ్ స్థానాలను గెలుచుకోవడంలోనే అర్థమవుతుంది ఇప్పటికైనా రానున్న మున్సిపాలిటీ ఎన్నికలలోపు ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల లోపు చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఆ దిశగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రయత్నం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ చేర్యాల మండల శాఖ కోరుతున్నట్లు తెలిపారు..

# నరేందర్ ఇక లేరు

- **చేర్యాలను కలిచి వేసిన మరణ నరేందర్ వార్త**
- **దుఃఖ సముద్రంలో మునిగిన ముస్త్యాల**

**సిద్దిపేట పవర్ చేర్యాల డిసెంబర్29**

చేర్యాల పోలీస్ హెడ్ కానిస్టేబుల్ నరేందర్ అకాల మరణం పోలీస్ శాఖకు, ప్రజాస్వామ్య వాదులకు తీరనిలోటు రాజ్యాంగబద్ధంగా ప్రజాస్వామ్యంలో ఎదగాలంటే ముందుగా మనిషికి కావలసింది చదువు చదువు ఉంటే ప్రతి మనిషి ఎంతో ఎత్తుకు ఎదగ గలుగుతాడు ప్రతి మనిషితో కలుపుగోలుగా మాట్లాడుతూ చట్టాల పట్ల అవగాహన కల్పిస్తూ సమ సమాజంలో ఏ విధంగా మెదులుకోవాలని చెపుతూ వచ్చేవారు ఇలాంటి వారు లేని లోటు ఎవరు తీర్చ లేరు. అతని ఆత్మకు శాంతి చేకూరాలని అతని కుటుంబ సభ్యులందరికీ ప్రగాఢ సానుభూతిని తెలియ జేయుచున్నాము. ఈ సమాజం మారాలనీ,ప్రజలు చట్టాల పట్ల అవగాహన పెంచుకొని చట్టాలను అతిక్రమించకుండా చట్టాలకు లోబడి అందరూ వ్యవహరించాలని సమాజంలోని అంతరాలు పోవాలని కలలుగనే ఇతని ఆశయ సాధన కోసం అడుగు లేస్తాం.. జై భీమ్



# ఏపీపీగా బాధ్యతలు చేపట్టిన జానీ భాష

**గురజాల డిసెంబర్ 29 సిద్దిపేట పవర్ ప్రతినిధి**

గురజాల పట్టణంలోని న్యాయస్థాన భవనంలోని సబ్ కోర్టు ఏపీపీగా షేక్ జానీ భాష సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గత 30 ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో ఉన్నారు. గతంలో ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. తనకు పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు, గుమస్తాలు, ఆయనకు అభినందనలు తెలియజేశారు.



# మాజీ సర్పంచుల అరెస్ట్ ల దుర్మార్గపు చర్య

- **చేర్యాల మండల మాజీ సర్పంచ్ లు.**

**చేర్యాల, డిసెంబర్ 29 (సిద్దిపేట పవర్)**

తెలంగాణలోని గ్రామ పంచాయతీల మాజీ సర్పంచుల పదవీకాలం పూర్తయి రెండు సంవత్సరాలు అయినా ఇంతవరకు చెల్లించాల్సిన బిల్లులు చెల్లించలేదని చేర్యాల మండల మాజీ సర్పంచ్ లు అన్నారు. సోమవారం నుంచి జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో తమ సమస్యల పరిష్కరించాలని మాజీ సర్పంచుల సంఘం ఇచ్చిన పిలుపులకు హైదరాబాద్ వెళ్తారని ముందస్తు అరెస్టులు చేయటం దుర్మార్గమని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మాజీ సర్పంచులను ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం ప్రభుత్వ హేయమైన చర్యకు నిదర్శనమని పేర్కొన్నారు. మండలంలోని పలువురు మాజీ సర్పంచులను పోలీసులు సోమవారం ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం అప్రజాస్వామీకం అన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ఐదేళ్లు డబ్బులు పెట్టి పని చేసిన తమను అరెస్టు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మాజీ సర్పంచ్‌లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందంటూ వారు ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల సర్పంచ్‌లకు రూ.1300 కోట్లు చెల్లించకపోవడం దుర్మార్గమైన చర్య అని ఆరోపించారు. పెండింగ్ బిల్లులు అందక రాష్ట్రంలోని 12,769 మంది మాజీ సర్పంచులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్ట్ అయిన వారిలో ముస్త్యాల మాజీ సర్పంచ్,సర్పంచ్ ల ఫోరమ్ మాజీ అధ్యక్షులు పెడుతల ఎల్లారెడ్డి, దొమ్మట మాజీ సర్పంచ్ సొంటిరెక్కల బిక్షపతి, దొమ్మాట మాజీ సర్పంచ్ సొంటిరెక్కల బిక్షపతి. అనంతరం ఎస్ఐ నవీన్ సొంత పూచీ కత్తుపై వదిలి పెట్టారు.



# జగదేవపూర్ పట్టణ ప్రభుత్వ సంఘం జగదేవపూర్ నూతన పాలక వర్గానికి శాలువాతో సన్మానం

- **సర్పంచ్ పనుగట్ల శ్రీనివాస్ గౌడ్ ఉప సర్పంచ్ మచ్చ గణేష్ కు శాలువాతో సన్మానం**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**



జగదేవపూర్ పట్టణ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తరపున జగదేవపూర్ మేజర్ గ్రామ పంచాయతీ నూతన పాలక వర్గానికి శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ నూతన పాలక వర్గం ద్వారా మన గ్రామం దేశంలో ఆదర్శ గ్రామంగా నిలవాలని దానికి మా సంఘం తరపున సలహాలు సూచనలు మా వంతుగా ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మచ్చ గణేష్ ప్రభుత్వ ఉద్యోగ సంఘం ప్రతినిధులు నాగరాజు రాజు బాబు వెంకట్రెడ్డి నవీన్ వెంకటయ్య వార్డు నెంబర్లు బచ్చలి భాస్కర్ శ్రీలత రాంచంద్రం యం డి ఇస్మాయిల్ దప్పు సంధ్య సాయి బత్తిని శ్రీనివాస్ బాలనర్సయ్య తాటిపాముల ఆంజనేయులు దండే వెంకటేష్ మాజీ మండల కో ఆపషన్ సభ్యులు ఇక్బాల్ గ్రామ శాఖ అధ్యక్షులు బుద్ధ నాగరాజు మాజీ ఎంపీటీసీ కొత్త కవిత శ్రీనివాస్ రెడ్డి దాచారం కనకయ్య దయాకర్ రెడ్డి ఆజిజ్ దండే భాస్కర్ తుర్కపల్లి అరుణ్ తదితరులు పాల్గొన్నారు

# జగదేవపూర్ మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడిగా పనుగట్ల శ్రీనివాస్ గౌడ్





**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

జగదేవపూర్ మండల సర్పంచ్ ల ఫోరం నూతన కార్యవర్గాన్ని ఆదివారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నూతనంగా ఎన్నుకోబడిన జగదేవపూర్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్ష కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి గజ్వేల్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగదేవపూర్ మండలంలోని సర్పంచులు అందరీ ఆమోదంతో జగదేవపూర్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షునిగా పనుగట్ల శ్రీనివాస్ గౌడ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జగదేవపూర్ మండలం సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులుగా ఆలేటి కవితలోలాకర్ రెడ్డి పోసానిపల్లి రాజు ప్రధాన కార్యదర్శి చెక్కల పరమేశ్వర్,కార్యదర్శులు, జుర్రు స్రవంతి వెంకటేశం, రజిత మల్లేశం క్యాషియర్ కనకయ్య సలహాదారులు రజిత పరశురాం ప్రచార కార్యదర్శి క్యాసారం కుమార్. కార్యవర్గ సభ్యులుగా బత్తిని రాజు గౌడ్ దిన రాజలింగం మౌనిక ముత్యం రజిత అశోక్ జ్యోతి మహేష్ సంధ్య శ్రీనివాస్ ను ఎన్నుకోవడం జరిగింది. జగదేపూర్ మండలం సర్పంచ్ల ఫోరం అధ్యక్ష కార్యవర్గానికి గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన గజ్వేల్ నియోజకవర్గ టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ వంటేరు ప్రతాప్ రెడ్డి ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ రాచమల్ల ఎల్లేష్ బి అర్ ఎస్ పార్టీ నాయకులు జంబూల శ్రీనివాస్ రెడ్డి రాచమల్ల ఉపేందర్ రెడ్డి రాజు ఆలేటి ఇంద్రసేనారెడ్డి రంగారెడ్డి కమల్ల భూమయ్య మాజీ ఎంపీటీసీ లు కొత్త కవితశ్రీనివాస్ రెడ్డి కిరణ్ గౌడ్ ఉప సర్పంచ్ మచ్చ గణేష్ మాజీ సర్పంచులు అంకిల్లా యాదవ రెడ్డి రవికాంటి చంద్రశేఖర్ రాజు బుద్ధ నాగరాజు చిలుకూరి మధుసూదన్ రెడ్డి కేశమైన మహేందర్ యాదవ్ మల్లేశం బాపు రెడ్డి సురేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

# హెడ్ కానిస్టేబుల్ నరేందర్ మృతి సమాజానికి తీరని లోటు

- **ఘన నివాళులర్పించిన చేర్యాల ప్రజలు**

**సిద్దిపేట పవర్ చేర్యాల డిసెంబర్29**

చేర్యాల పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న నరేందర్ (50) మృతి యావత్ సమాజానికి తీరనిలోటని చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పుర్మ ఆగం రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్, జాతీయ మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి బుట్టి సత్యనారాయణ, చేర్యాల ప్రాంత పరిరక్షణ కమిటీ కన్వీనర్ పందిళ్ళ నర్సయ్య లు మాట్లాడుతూ.. సామాన్య మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన నరేందర్ 1995లో ఉద్యోగంలో చేరి సమాజంలో జరుగుతున్న అసమానతలు అవమానాలపై, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత బానిస కాకుండా సన్మార్గంలో నడవాలని సినిమాలు తీసి ఎంతో చైతన్యం చేశారని, కరోనా విపత్కర పరిస్థితిలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని పలు కార్యక్రమాలను నిర్వహించారన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదని సూచిస్తూ వందల మందికి హెల్మెట్లు సొంత డబ్బులతో కొనుగోలు చేసి పంపిణీ చేసి ఎంతోమంది ప్రాణాలను కాపాడినట్లు తెలిపారు. నిరుపేద వధువుల పెండ్లిలకు పుస్తె మట్టెలు,పేద విద్యార్థుల చదువుకు నోటు పుస్తకాలు, పేదలు మరణిస్తే వారి కుటుంబానికి 50 కిలోల బియ్యం చొప్పున పంపిణీ చేసి బాసటగా నిలిచి ఆదుకున్నారని పేర్కొన్నారు. కూడు గూడు గుడ్డ లేక రోడ్లపై నివసిస్తున్న కడు పేదలకు బట్టలు, భోజనం సౌకర్యాలు కల్పించి ఆదుకున్నారని, కొత్త బస్టాండ్ శిథిలావస్థకు చేరితే సొంత డబ్బులతో మట్టి పోయించి మరమ్మతులు చేపట్టారని ఈ ప్రాంతంలో హెడ్ కానిస్టేబుల్ గా సామాజిక సేవకునిగా ఎన్నో సేవలు అందించి కొద్ది సమయంలోనే చేర్యాల ప్రాంత ప్రజల మన్ననలు పొందిన గొప్ప వ్యక్తి నరేందర్ అని ఆయన సేవలను కొనియాడారు. ఆయన మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో వివిధ పార్టీల ప్రజాసంఘాల నాయకులు అందె నాని బాబు, చింతల విజయ్ కుమార్, గుడ్ల శ్రీనివాస్, బండారి అంజయ్య, అంబటి అంజయ్య, తౌట పశుపతి, అల్లం రమేష్, శ్రీరాం వెంకటేష్, ఎర్రగుంట్ల ప్రభాకర్, మరికొండ వెంకటయ్య, మాచర్ల బాబు, మల్లిగారి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.




TELANGANA
RISING
2047
SOCIAL MEDIA
TELANGANA CONGRESS
జనవరి నుంచే
విజన్ అమలు!.
ప్రజా ప్రభుత్వం
కసరత్తు షురూ
SKILL